ఆద్యంతం ఉత్కంఠ

- ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేస్తారంటూ ప్రచారం
- మోడీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఢిల్లీలో ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ సందర్భంగా రాష్ట్రంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఉదయం నుంచే భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) కార్యకర్తలు పెద్దఎత్తున హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అగ్గికి ఆజ్యంపోసినట్టు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి అసభ్యంగా మాట్లాడటంతో బిఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. బండి సంజయ్‌ను అరెస్టు చేయాలంటూ రోడ్లపైకి వచ్చారు. తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బిఆర్ఎస్ మహిళా కార్యకర్తలు రాజ్‌భవన్ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులకు వారికి మధ్య పెనుగులాట జరిగింది. మోడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈడీ విచారణానంతరం ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేస్తారనే ప్రచారం జరగడంతో మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి తారకరామారావు ముందురోజే (శుక్రవారం) ఢిల్లీకి వెళ్లారు.

కవితను అరెస్టు చేస్తే రాష్ట్ర మంత్రులు ఢిల్లీలో ఆందోళనలు చేయాలనే వ్యూహంతో వెళ్లినట్టు సమాచారం. మరోవైపు ప్రగతి భవన్ వద్దకు భారీగా బిఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోవడంతో అక్కడ కూడా ఉద్రిక్తత ఏర్పడింది. ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ఎప్పటికప్పుడు ఆరా తీశారు. రాత్రి 7 గంటల సమయంలో కవితను అరెస్టు చేయట్లేదని ఢిల్లీలోని ఈడీ కార్యాలయం మీడియాకు లీకులు ఇచ్చింది. దీనితో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఎమ్మెల్సీ కవితపై బండి అనుచిత వ్యాఖ్యలు

- రాష్ట్ర మహిళా కమిషన్ విచారణకు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతీయ జనతా పార్టీ (బిజెపి) రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ శనివారం సీరియస్ అయింది. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయనీ, దీన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ నేపథ్యంలో బండి సంజయ్‌కు మహిళా కమిషన్ నోటీసులు జారీ చేయనుంది. మహిళల గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు ఉన్నాయని కమిషన్ చైర్మెన్ సునీతా లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర మహిళా కమిషన్ సంజయ్ వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించనుంది. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని డీజీపీని మహిళా కమిషన్ విచారణకు ఆదేశించింది.

పశుమిత్రలకు కనీస వేతనమివ్వండి

18న డిఆర్‌డిఎ ఆఫీసుల ఎదుట ధర్నాలు : సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పశుమిత్రలకు కనీస వేతనమివ్వాలని పశుమిత్ర వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసు మాధవి డిమాండ్ చేశారు. పశుమిత్రల డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 18న డిఆర్‌డిఎ ఆఫీసుల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామనీ, 20న కలెక్టర్లకు వినతిపత్రాలిస్తామని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ-పశు పోషకులకు మధ్య పశుమిత్రలు వారధిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వారికి కనీసం గౌరవ వేతనం కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. వారికి యూనిఫామ్‌లు, గుర్తింపుకార్డులు, గ్లౌజులు, మాస్కులు, మెడికల్ కిట్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశుమిత్రలందరికీ ఏఐ ట్రైనింగ్ ఇవ్వాలని కోరారు. కొత్త రజిని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీరాం పద్మ, ఎమ్‌డీ నాజియా, సమ్రీన్, చైతన్య, ఇరుసుల్ల శ్రీలత, మనీషా, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి సన్నాసులకు తెలంగాణ ప్రగతి అర్థం కాదు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ట్వీట్‌పై మంత్రి కెటిఆర్ ఘాటు స్పందన

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

'గుజరాతీ బాసుల చెప్పులు మోసే బిజెపి సన్నాసులకు తెలంగాణ ప్రగతి అర్థం కాదు' అంటూ భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్రమంత్రి తారకరామారావు ట్వీట్ చేశారు. మిలియన్ మార్చ్‌ను గుర్తు చేస్తూ కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి చేసిన ట్వీట్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో మంత్రి కెటిఆర్ కూడా అంతే ఘాటుగా స్పందించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా మిలియన్ మార్చ్‌కు పుష్కరకాలం గడిచిందనీ, కెసిఆర్ నియంతృత్వ పాలనలో కనీస గుర్తింపు లేకపోవడం దురదృష్టకరమని ట్వీట్ చేశారు. కల్వకుంట్ల కుటుంబానికి తప్ప మిలియన్ మార్చ్‌కు కారణమైన నేతలకు, ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు, విమోచన దినోత్సవానికి సరైన గుర్తింపు లభించడం లేదంటూ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఉద్యమం పేరిట అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఉద్యమాలనే అణచివేయాలని చూస్తున్నారనీ, తెలంగాణ ప్రజల కండ్లలో కడగళ్లు మిగిల్చేలా కెసిఆర్ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కోట్లాది ప్రజలు కొట్లాడితే కల్వకుంట్ల కుటుంబం మాత్రమే కూర్చొని అధికారాన్ని చెలాయిస్తోందంటూ విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారిని నేడు పక్కన కూర్చోబెట్టుకుని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ, ఇంకా అనేక అంశాలను ప్రస్తావిస్తూ ఆక్రోశం వెళ్లగక్కారు. దీనిపై రాష్ట్ర మంత్రి కెటిఆర్ కూడా అంతే ఘాటుగా స్పందించారు. "తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా పారిపోయిన ఎమ్మెల్యే ఎవరో చెప్పుకోండి చూద్దాం" అంటూ అదే ట్విటర్ వేదికగా ప్రశ్నించారు. "తల్లిని చంపి బిడ్డను ఇచ్చారని తెలంగాణ పుట్టుకనే పలుమార్లు అవమానించిన మోడీకి, గుజరాతీ బాసుల చెప్పులు మోసే బిజెపి సన్నాసులకు తెలంగాణ ప్రగతి అర్థం కాదు" అంటూ ట్వీట్ చేశారు. మోడీ వ్యాక్సిన్ కనిపెట్టాడంటూ గొప్పలు చెప్పుకోవడం మానేసి, ప్రజలకు పనికి వచ్చే పనులు చేయాలంటూ ట్వీట్ చేశారు.

టిఎస్‌పిఎస్‌సి హ్యాక్

- టౌన్ ప్లానింగ్ పరీక్ష వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివారం జరగాల్సిన టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ పరీక్ష వాయిదా పడిందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 15, 16న జరగాల్సిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్ష కూడా వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. టిఎస్‌పిఎస్‌సి పరీక్షలకు సంబంధించిన కంప్యూటర్ హ్యాక్ అయిందని అనుమానిస్తున్నారు. హ్యాకింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని అధికారులు తెలిపారు. వాయిదా పడిన పరీక్షల తేదీలు మళ్లీ ప్రకటిస్తామని వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల కష్టాలు తీరుతాయి

- కార్మిక శాఖ మాజీ మంత్రి వినోద్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజల కష్టాలు తీరుతాయని మాజీ కార్మిక శాఖ మంత్రి గడ్డం వినోద్ అన్నారు. శనివారం హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా కాసి పేట మండలంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నాయకులు ఎండగట్టాల న్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ, ధరణి పోర్టల్ రద్దు, గ్యాస్, విద్యుత్ ధరలు తగ్గుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై ధరలను పెంచి ఆర్థిక భారం మోపుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల ఇబ్బందులు తీరుతాయన్నారు. మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం ప్రదీప్, సీనియర్ నాయకులు ఆశాలు, గుండ రాజ్‌కుమార్, సమిల్, ప్రవీణ్, బోర్లకుంట ప్రణయ్, ఎస్‌కె షారూఖ్, సురేష్,పద్మ, రవిరాజా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి రాజయ్య రాజీనామా చేయాలి

- మహిళా కాంగ్రెస్ నేత నీలం పద్మ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళా సర్పంచ్ పట్ల అనుచితగా ప్రవర్తించిన ఎమ్మెల్యే రాజయ్య తన పదవికి రాజీనామా చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ నీలం పద్మ డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు హైదరాబాద్‌లో గాంధీభవన్ వద్ద రాజయ్య దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ జనగామా జిల్లా ధర్మసాగర్ మండలంలోని జానకిపురం సర్పంచ్ కురసపెల్లి నవ్యను లైంగికంగా వేధించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పదవి నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత, మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు నవ్యకు క్షమాపణ చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ అధ్యక్షులు పుస్తకాల కవిత, నాయకులు సుభాషిణి, సంగీత, రమాదేవి, జిలాని, భాగ్యలక్ష్మి, రోజి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తాం

పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని టిపిసిసి చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. జోడో యాత్రలో భాగంగా శనివారం జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో పర్యటించిన ఆయన మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముత్యంపేట చక్కెర కర్మాగారం పరిధిలో 10 లక్షల ఎకరాల్లో చెరుకు సాగయ్యేదని, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయని అన్నారు. నిజామాబాద్ ఎంపీగా కొనసాగిన కల్వకుంట్ల కవిత వంద రోజుల్లో చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని చెప్పి.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉన్నదాన్నే మూసేశారని విమర్శించారు. రైతుల ఆత్మగౌరవమైన చక్కెర కర్మాగారం ముగిసిన అధ్యాయం అయితే.. కేసీఆర్ అధికారం కూడా ముగిసిన అధ్యాయమే అవుతుందన్నారు. మోడీ మెడలు వంచిన హర్యానా రైతుల స్ఫూర్తితో ఇక్కడి రైతులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. వారి పోరాటానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మోడల్ పాలన అవసరమన్నారు. కాంగ్రెస్ పాలన.. బీఆర్ఎస్ పాలనపై చర్చకు సిద్ధమా అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ నాయకులు జావిద్, జిల్లా అధ్యక్షుడు అల్లూరి లక్ష్మణ్, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నరసింగరావు, రాష్ట్ర నాయకులు కృష్ణారావు, కల్వకుంట్ల సుజిత్ రావు, కొమిరెడ్డి కరంచంద్, కాటిపెల్లి శ్రీనివాస్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యనారాయణ రెడ్డి, ఎల్లాల జలపతి రెడ్డి, రైతు నాయకులు మామిడి నారాయణ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

బండి మాటలను వక్రీకరిస్తున్నారు : తరుణ్‌చుగ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లిక్కర్ స్కామ్ విషయంలో విచారణ ఎదుర్కొంటున్న కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల్ని వక్రీకరిస్తున్నారని బిజెపి రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దర్యాప్తు సంస్థల ముందు ఎవరైనా ఒక్కటేనని తెలిపారు. లిక్కర్ స్కామ్‌లో విచారణ ఎదుర్కొంటున్న కవిత నిజాలు చెప్పాలని సూచించారు. తెలంగాణ తొలి రాష్ట్ర క్యాబినెట్‌లో ఒక్క మహిళా మంత్రి కూడా లేరనీ, రెండో క్యాబినెట్‌లోనూ ఇద్దరే మహిళా మంత్రులున్నారని విమర్శించారు. అలాంటి వాళ్లు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు కోసం కవిత ఢిల్లీలో దీక్ష చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

ప్రభుత్వ అవినీతిపై విచారణ జరపండి

మాజీ ఎమ్మెల్యే అనిల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ డిమాండ్ చేశారు. పంజాబ్, గోవా ఎన్నికల్లో ఆప్ పార్టీ డబ్బులు సమకూర్చిందని ఆరోపించారు. పంజాబ్ ఎన్నికల్లో ఎమ్మెల్సీ కవిత కూడా రూ.100 కోట్లు అడ్వాన్స్ ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ ప్రాజెక్టుల్లో భారీ కుంభకోణాలు జరిగాయంటూ కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారే తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వంపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

మార్చి 16 నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర

- ఎఐసిసి గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర ఈ నెల 16 నుంచి జూన్ 15 వరకు 91 రోజులపాటు పాదయాత్ర చేయనున్నట్టు ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం, బజరహత్నూర్ మండలం, పిప్పిరి గ్రామం నుంచి పాదయాత్ర చేస్తానన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి విలేకర్లతో మాట్లాడారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు 39 నియోజకవర్గాల్లో 1365 కిలోమీటర్ల మేర పాదయాత్రకు రూపకల్పన చేసినట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగనే తెలంగాణ లక్ష్యాలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు పాదయాత్రలో భాగంగా మంచిర్యాల, హైదరాబాద్ శివారు ప్రాంతం, ఖమ్మంలో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు.

మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

అదిలాబాద్ జిల్లా బెల్లంపల్లిలోని తాళ్లగురిజాల పోలీసుల ఆధ్వర్యంలో తెలంగాణ వెల్ఫే ర్ బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు, ఉమెన్‌సేఫ్టీ, షీటీమ్స్ పని తీరుపై రూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై రాజశేఖర్‌లు వివరించారు. తాత్కాలిక ఆనందాల కోసం ప్రలోభాలకు, ఆకర్షణలకు గురై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదవి విద్య నేర్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. స్మార్ట్ ఫోన్‌ల వినియోగం పెరిగి పోవడంతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని, ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు.

ఎస్‌సి వర్గీకరణ సాధనే ధ్యేయం : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి వర్గీకరణ సాధనే ధ్యేయంగా మాదిగ సంగ్రామ యాత్ర చేపట్టామని - మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రేగుంట కేశవరావు అన్నారు. ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న మహా సంగ్రామ యాత్ర శనివారం ఆసిఫాబాద్ రూరల్ రెబ్బెన మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఎస్సీ వర్గీకరణ చేపడుతామని హామీ ఇచ్చి విస్మ రించిందన్నారు. ఎస్సీవర్గీకరణ చేపట్టాలని ఏప్రిల్ 4న హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సమ్మయ్య మాట్లాడుతూ నిరసన కార్యక్ర మానికి జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎ స్ నాయకులు మల్లేష్, ప్రభాకర్, సురేష్, రమేష్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్లకోమా వారోత్సవాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్లకోమా (నీటి కాసులు) నయం చేయలేని జబ్బు. ఒకసారి వస్తే దాన్ని తిరికి వెనక్కి పంపించడం సాధ్యం కాదు. కంటి వెనుకభాగంలో ఉన్న నరం దెబ్బతినడం ద్వారా వచ్చే ఈ వ్యాధి కారణంగా రాష్ట్రంలో దాదాపు నాలుగు లక్షల మంది శాశ్వత అంధత్వానికి గురయ్యే ప్రమాదముందని అంచనా. ఎటువంటి నొప్పి, లక్షణాలు లేకుండా క్రమేణా కనుచూపును కనుమరుగు చేస్తున్న నిశ్శబ్ద అంధత్వ కారకమైన గ్లకోమా పట్ల అప్రమత్తంగా ఉండాలని పలువురు కంటి వైద్యులు సూచిస్తున్నారు. శనివారం సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని, గ్లకోమా స్పెషలిస్ట్ ప్రొఫెసర్, డాక్టర్ వెంకటరత్నం, గ్లకోమా విభాగం డాక్టర్ సుపర్ణ, ఆర్ఎంఓ నజఫియా, హైదరాబాద్ జిల్లా అంధత్వ నియంత్రణ అధికారి డాక్టర్ దీపక్ రెడ్డి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మోదిని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది మార్చి 12 నుంచి 18 వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. ఈ క్రమంలో మన రాష్ట్రంలోనూ ప్రజల్లో అవగాహన పెంచేలా వారోత్సవాలను వినియోగించుకుంటున్నట్టు చెప్పారు. ఆదివారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు హైదరాబాద్ సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో నిర్వహించే ప్రదర్శన, సదస్సును వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించనున్నట్టు తెలిపారు. అనంతరం వారం రోజుల పాటు రకరకాల కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. 40 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరు ఏడాదికి ఒకసారైనా గ్లకోమా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధిగ్రస్తుల్లో 40 శాతం మందికి వంశపారంపర్యంగా వస్తుందన్నారు. గ్లకోమా ఒక కంటిలో మొదలై రెండో కంటిలోనూ పెరిగిపోతుందని హెచ్చరించారు. గ్లకోమా వచ్చిన వారికి కాటరాక్ట్ పరీక్ష చేసినా ప్రయోజనం ఉండదని తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా గుట్టురట్టు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- వివిధ యూనివర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లు సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాలకు వెళ్లేందుకు అవసరమైన సర్టిఫికెట్లతోపాటు ఉన్నత చదువులకు అవసరమయ్యే సర్టిఫికెట్లు నకిలీవి తయారు చేస్తూ.. విక్రయిస్తున్న ముఠాను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు, ఫలక్‌నుమా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి వివిధ యూనివర్శిటీలు, ఇన్‌స్టిట్యూషన్లకు చెందిన నకిలీ సర్టిఫికెట్లతోపాటు కంప్యూటర్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ కలిముద్దీన్ 7వ తరగతి చదివాడు. చెత్తబజార్‌లోని 'డైమండ్ గ్రాఫిక్ ప్రింటింగ్ ప్రెస్'లో డిటిపి ఆపరేటర్‌గా చేరాడు. 2015లో అక్కడ గ్రాఫిక్స్, కోరల్‌డ్రా సాఫ్ట్‌వేర్ నేర్చుకున్నాడు. ఈ క్రమంలో సులువుగా డబ్బులు సంపాదించాలని నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయించాడు. విషయాన్ని రాజేంద్రనగర్‌కు చెందిన ఎండి ఫేరోజ్, లంగర్‌హౌజ్‌కు చెందిన అబ్దుల్ బాషీత్ ఆసీఫ్‌కు చెప్పాడు. వారితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఢిల్లీకి చెందిన శివానితో చేతులు కలిపారు. అమెరికా, యూకేతోపాటు తదితర దేశాలకు వెళ్లేవారితోపాటు ఉన్నత చదువులకు అవసరమైన సర్టిఫికెట్లను తయారు చేస్తున్నారు. వాటిని కావాల్సినవారికి విక్రయిస్తూ డబ్బులు తీసుకుంటున్నారు. ఆంధ్రా యూనివర్శిటీ, ఉస్మానియా, చండిగఢ్‌తోపాటు వివిధ యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్లను తయారు చేస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు పలుసార్లు జైలుకెళ్లొచ్చినా వారిలో మార్పురాలేదని ఏసీపీ తెలిపారు. జైలు నుంచి తిరిగొచ్చిన తర్వాత నకిలీ సర్టిఫికెట్ల దందాను కొనసాగిస్తున్నారన్నారు. పరారీలోవున్న ఢిల్లీకి చెందిన శివాని కోసం గాలిస్తున్నామని చెప్పారు.

బిల్లులివ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటా..

- అధికారులకు సర్పంచ్ అల్టిమేటం
- సోషల్ మీడియాలో ఆడియో వైరల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులపై ఓ సర్పంచ్ రిలీజ్ చేసిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బిల్లుల పేమెంట్ చేయకపోతే పదిహేను రోజుల్లో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఆడియోలో అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. ఆడియోలోని వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటాయపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమల్ల మేఘరాజ్ ఓ ఆడియోను రికార్డు చేసి అధికారులకు పంపుతూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తన గ్రామంలో శ్మశానవాటిక, సెగ్రేషన్ షెడ్డు నిర్మాణం చేపట్టగా నేటికీ ఎంబీ రికార్డు చేయలేదని ఆరోపించారు. రూ.64 వేలు వెచ్చించి క్రీడా ప్రాంగణం నిర్మిస్తే రూ.42 వేల ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పేమెంట్ అయిందని ఆవేదన చెందాడు. గ్రామంలో చేపట్టిన పనులకే బిల్లులు పేమెంట్ కాక ఇబ్బంది పడుతుంటే, అధికారుల ఒత్తిడితో వర్షాలకు కూలిన సెగ్రేషన్ షెడ్డు రెండోసారి నిర్మిస్తే బిల్లు రికార్డు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయాడు. అభివృద్ధి పనులు చేపట్టేలా ఒత్తిడి చేసిన ఎంపీడీవో భాస్కర్‌రావు, ఈజీఎస్ ఏపీవో చంద్రశేఖర్ బిల్లుల పేమెంట్ విషయంలో పట్టించుకోక నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామ కార్యదర్శి లాంగ్ లీవ్ పెట్టుకుని వచ్చిపోతుంటే గ్రామాభివృద్ధి కుంటుపడిందని, కొత్త కార్యదర్శిని నియమించాలని డీపీవోకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందాడు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎంబీ రికార్డులు చేయకపోగా,

రికార్డు అయిన పేమెంట్ కాక తనలాగే సర్పంచులు ఆవేదన చెందుతున్నారని, తన ఆత్మహత్యతోనైనా సర్పంచులకు న్యాయం జరుగుతుందని రికార్డులో పేర్కొన్నారు. పదిహేను రోజుల్లో తన బిల్లుల పేమెంట్ చేయపోతే గంగాధర మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకోవడం ఖాయమని సర్పంచ్ మేఘరాజు అధికారులకు అల్టిమేటం జారీ చేశారు.

ఇప్పటికే బిల్లు పేమెంట్ చేశాం : అధికారుల వెల్లడి

ఎన్ఆర్ఈజీఎస్ కింద నిర్మించిన సెగ్రేషన్ షెడ్డుకు ఇప్పటికే బిల్లు పేమెంట్ చేశామని ఎపిఒ చంద్రశేఖర్ వెల్లడించారు. నిర్మించిన షెడ్డు వర్షాలకు కూలిపోగా మరోసారి సెగ్రేషన్ షెడ్డు నిర్మించిన సర్పంచ్ ఏఈపీఆర్ ద్వారా బిల్లు రికార్డు చేసుకుని జీపీ ఫండ్స్ ద్వారా పేమెంట్ తీసుకోవాలన్నారు. సెగ్రేషన్ షెడ్డుకు ఇప్పటికే పేమెంట్ చేసినందున మరోసారి చేయరాదని స్పష్టం చేశారు. ఇదే విషయమై పీఆర్ ఏఈ రమేశ్‌ను వివరణ కోరగా, ఎన్ఆర్ఈజీఎస్ ద్వార బిల్లు పేమెంట్ కావాలి తప్ప తాను చేసేదేమీ లేదన్నారు. ఒకే సెగ్రేషన్ షెడ్డుకు రెండుసార్లు ఎంబీ రికార్డు చేయడం సాధ్యకాదన్నారు. ఎంపీడీవో భాస్కర్‌రావును ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. గ్రామ కార్యదర్శి లేక ఇబ్బంది పడుతున్న అంశాన్ని ఎంపీవో జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఉన్న కార్యదర్శి లాంగ్ లీవ్‌లో వెళ్లారని, కాచిరెడ్డిపల్లి కార్యదర్శికి అదనపు బాధ్యతలు ఇచ్చామని చెప్పారు.

నేర న్యాయ వ్యవస్థ మరింత సులభతరం కావాలి

- ఉన్నతస్థాయి సమావేశంలో డిజిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నేర న్యాయ వ్యవస్థ (క్రిమినల్ జస్టిస్ సిస్టమ్) మరింత సులభతరం కావాలనీ, అందుకు అనువైన మార్గాలను అటు న్యాయ నిపుణులు, ఇటు పోలీసు ఉన్నతాధికారులు సమన్వయంతో అన్వేషించాలని రాష్ట్ర డిజిపి అంజనీ కుమార్ అన్నారు. శనివారం డిజిపి కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులు, న్యాయ కోవిదులతో కూడిన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌ను ప్రజలకు మరింత సులభతరం చేయడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంపొందించాల్సినవసరం ఉన్నదని డిజిపి అభిప్రాయపడ్డారు. ప్రజలకు న్యాయాన్ని త్వరితగతిన, మరింత సులువుగా అందుబాటులోకి తేవడానికి కేసుల దర్యాప్తు సాగించే పోలీసు వ్యవస్థ కోర్టులలో దానికి అనుగుణమైన తీర్పులను సాధించే న్యాయవాద వ్యవస్థ మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయనన్నారు. ముఖ్యంగా, ఈ సమన్వయ వ్యవస్థ మరింత పారదర్శకంగా ముందుకు సాగడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ వ్యవస్థను మరింతగా పరిపుష్టత చేయడానికి ప్రతి మూడు నెలలకోసారి పోలీసున్నతాధికారులు, న్యాయకోవిదుల మధ్య సమన్వయ సమావేశాలను నిర్వహించాలని ఇందులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శివప్రసాద్‌తో పాటు ఇతర న్యాయ కోవిదులు, రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, రాష్ట్ర పోలీసు లీగల్ విభాగం అదనపు డీజీ కె. శ్రీనివాస్‌రెడ్డి, మరో అదనపు డిజి సౌమ్య మిశ్రా, పోలీసు పర్సనల్ విభాగం ఐజీ కమలాసన్ రెడ్డిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇవి బ్రేక్ ప్యాడ్‌లను ఆవిష్కరించిన బ్రేక్స్ ఇండియా

హైదరాబాద్ : ఆటోమోటివ్ రంగం అవసరాలకు అనుగుణంగా బ్రేక్స్ ఇండియా బ్రాండ్ కొత్తగా ఇవిల కోసం బ్రేక్ ప్యాడ్‌లను ఆవిష్కరించినట్లు తెలిపింది. టివిఎస్ అపాచీ ఇవిల కోసం అడ్వాన్స్‌డ్ ఫ్రిక్షన్ టెక్నాలజీతో కూడిన జాప్ (జడ్ఎపి) బ్రేక్ ప్యాడ్‌లను విడుదల చేసినట్లు పేర్కొంది. తుప్పు నుండి రక్షించడం, నిశ్శబ్దమైన బ్రేకింగ్ వంటి మెరుగైన ప్రత్యేకతలతో జాప్ ఎంతో ప్రత్యేకంగా రూపొందించబడిందని ఆ కంపెనీ పేర్కొంది. ఆరు దశాబ్దాలుగా భారతీయ, ప్రపంచ ఒఇఎమ్ (ఒరిజనల్ ఎక్విప్‌మెంట్ మాన్యూఫాక్చరర్)లకు ప్రత్యక్ష సరఫరాదారుగా బ్రేక్స్ ఇండియా ఉత్పత్తులను అందిస్తుంది.

నగరంలో "టాయ్స్ ఆర్ అస్" స్టోర్ ప్రారంభం

హైదరాబాద్ : సాంకేతికాధారిత రిటైల్ కంపెనీ ఎస్ టార్టెల్ హైదరాబాద్‌లో కొత్తగా 'టాయ్స్ ఆర్ అస్'ను శనివారం ప్రారంభించింది. హైటెక్‌సిటీ సమీపంలోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్ వద్ద దీన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ నూతన శ్రేణీ బ్రాండెడ్ బొమ్మలు అందించనున్నటు ఎస్ టర్టెల్ సిఇఒ నితిన్ చాబ్రా పేర్కొన్నారు. విస్తృత శ్రేణీ అత్యున్నత ఉత్పత్తుల ద్వారా స్టోర్ లోపల మరుపురాని అనుభవాలను అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

వేడుకగా క్రిటికల్ రివర్ వార్షికోత్సవం

హైదరాబాద్ : అంతర్జాతీయ డిజిటల్, సాంకేతిక కన్సల్టింగ్ సేవల కంపెనీ క్రిటికల్ రివర్ నగరంలో తమ 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నట్లు తెలిపింది. ఈ వేడుకలలో భాగంగా సానుకూల ధోరణులు ప్రదర్శించిన, అత్యుత్తమ క్లయింట్ సేవలను అందించిన ఉద్యోగులను గుర్తించి వారికి అవార్డులను అందజేసినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా క్రిటికల్ రివర్ సిఇఒ అంజిరెడ్డి మాట్లాడుతూ.. "ఈ తొమ్మిదేళ్లలో మా కంపెనీ అద్భుత ప్రగతిని కనబర్చింది. 2014లో కేవలం 24 మంది ఉద్యోగులతో, దీర్ఘకాలపు లక్ష్యాలను ఏర్పరుచుకుని ప్రారంభించాం. నేడు మా వద్ద వెయ్యి మందికిపైగా అంకిత భావం కలిగిన ఉద్యోగులు తొమ్మిది దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. మా సహచర ఉద్యోగుల సమక్షంలో ఈ విజయాలను వేడుక చేయడం పట్ల సంతోషంగా ఉన్నాం. పరిశ్రమలో అగ్రగామిగా ముందుండడంతోపాటుగా విజయాన్ని కొనసాగించడానికి కలిసికట్టుగా ముందుకు వెళ్దాం" అని అన్నారు.

రైతులను అడ్డుకోవద్దు

- హైకోర్టు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లాలో గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం పేరుతో తమను సొంత భూముల్లోకి వెళ్లనీయడం లేదంటూ గుడాటిపల్లి గ్రామానికి చెందిన బోయిని భాస్కర్, ఇతరులు వేసిన కేసులో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు పిటిషనర్లను వాళ్ల భూముల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకోరాదని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఇతరులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రాజెక్టు కాంట్రాక్టర్, ఇరిగేషన్ ఆఫీసర్లు రైతుల విషయంలో సమయమనం పాటించాలని జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. హుస్నాబాద్ నుంచి రామవరం వెళ్లే రహదారిని పోలీసులు మూసివేశారని, తమ జీవనోపాధి కోసం తమ పొలాల్లోకి వెళ్లి పని చేయడానికి వీలు లేదని చెబుతున్నారని రైతుల లాయర్ చెప్పారు. రైతులకు పరిహారం ఇచ్చామని ప్రభుత్వం చెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు విచారణను 31కి వాయిదా వేసింది.

విచారణను ఎదుర్కోండి

- రాజగోపాల్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓబుళాపురం మైనింగ్ లీజులో అక్రమాలు జరిగాయనే కేసులో సిబిఐ కోర్టులో వేసిన డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టేయడాన్ని సవాల్ చేసిన గనుల శాఖ మాజీ డైరెక్టర్ రాజగోపాల్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో తన డిశ్చార్జి పిటిషన్‌ను సిబిఐ కోర్టు కొట్టేయడం అన్యాయమని పిటిషనర్ వాదనను చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తోసిపుచ్చారు. సిబిఐ కోర్టులోని అభియోగాలపై విచారణను ఎదుర్కోవాలని చెప్పారు.

దానం నాగేందర్‌పై చార్జిషీట్ డిస్మిస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోకి చొరబడి దౌర్జన్యానికి పాల్పడ్డారనే అభియోగాల కేసులో ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. కింది కోర్టులో పోలీసులు నమోదు చేసిన చార్జీషీట్‌ను కొట్టివేసింది. 2012 నాటి కేసులో ఆలయ మేనేజర్ సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు తర్వాత పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ ఆయనతో రాజీ చేసుకున్నారు. ఇరువురి మధ్య జరిగిన రాజీ ఒప్పందాన్ని పరిశీలించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ పోలీసుల చార్జిషీట్‌ను కొట్టేస్తూ తుది ఉత్తర్వులిచ్చారు

ఎన్నాళ్లీ ఎదురుచూపులు..?

- పతనమవుతున్న పత్తి ధర
- చేతులెత్తేసిన సిసిఐ
- పట్టించుకోని కేంద్రం
- ఇళ్లల్లోనే నిల్వలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా బేల మండలం శంషాబాద్ గ్రామానికి చెందిన శుభంఖోడే అనే రైతు 8 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు అవసరాల కోసం 20 క్వింటాళ్లు మాత్రమే విక్రయించారు. మిగతా 60 క్వింటాళ్ల పత్తిని ఇంట్లోనే నిల్వ చేశారు. ధర పెరుగుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ మొదట్లో ఉన్న ధర కూడా రానురానూ మరింత దిగజారుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.

జైనథ్ మండల కేంద్రానికి చెందిన ఆశన్న నాలుగెకరాల్లో పత్తి సాగుచేశారు. 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు క్వింటాల్ పత్తి కూడా మార్కెట్‌కు తీసుకెళ్లలేదు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ధర పెరుగుతుందనే ఆశతో పత్తి మొత్తాన్ని ఇంట్లోనే నిల్వ ఉంచారు. ఇలాంటి రైతులు రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఉన్నారు. ధర పెరుగుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. కానీ, ధర పెరగకపోగా.. మరింత తగ్గుతుండటంపై ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి రైతుల అవస్థలు తీరడం లేదు. మార్కెట్‌లో ధర పెరగకపోవడంతో పండించిన పత్తి పంటను ఇంట్లోనే నిల్వ చేసుకుంటున్నారు. పంట కాలం పూర్తయినా ఇంకా విక్రయించే పరిస్థితి లేదు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. మార్కెట్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.8300 వరకు పలికిన ధర తాజాగా క్వింటాల్‌కు రూ.7300కి పడిపోయింది. దీంతో పత్తిని విక్రయించేందుకు రైతులు ముందుకు రావడం లేదు. మరోపక్క వాణిజ్య కొనుగోళ్లు చేపడతామని చెప్పిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పూర్తిగా చేతులెత్తేసింది. కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ కేంద్ర ప్రభుత్వం పత్తి సేకరణకు నిదులు తగ్గించింది. ప్రయివేటు వ్యాపారులతో సమానంగా ధర నిర్ణయిస్తూ రైతులకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. ఈ ఏడాది కనీసం కిలో పత్తి కూడా సదరు సంస్థ కొనుగోలు చేయకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క కిందటేడాది పత్తి మొత్తం విక్రయించిన తర్వాత క్వింటాల్‌కు రూ.10,300 వరకు ధర ఉండటంతో రైతులు అదే ఆశతో ఉన్నారు. ఈ ఏడాది కూడా సీజన్ చివరలో పత్తి ధర రూ.10 వేల వరకు పెరుగుతుందనే నమ్మకంతో ఉన్నారు. నెలల తరబడి క్వింటాళ్ల కొద్దీ పత్తిని ఇంట్లోనే నిల్వ చేసుకున్నారు. కానీ అధికారవర్గాలు మాత్రం ధర పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు.

కెసిఆర్ కుటుంబాన్ని బద్నాం చేయడానికే కవితకు నోటీసులు

- మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణపై కేంద్రం కక్ష కట్టిందని, అందులో భాగంగానే తమ నేతలపై దాడులు జరిగాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కెసిఆర్ కుటుంబాన్ని బద్నాం చేయడానికి కవితకు నోటీస్‌లు పంపారని మండిపడ్డారు. బిజెపిది దుర్మార్గపు పద్ధతి అని అన్నారు. తప్పు చేయనప్పుడు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

అధికార దాహంతో తెలంగాణ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్ మాటలకు అర్థం లేదన్నారు. దేశంలో అనేక మంది సిఎంలు, మంత్రుల మీద ఇలాంటి దాడులే చేశారని... లొంగిపోతే వైఖరి మార్చుకున్నారంటూ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శలు గుప్పించారు. మరోవైపు ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి రెండు గంటలుగా కవిత ఇడి విచారణ కొనసాగుతోంది. కవితను ముగ్గురు అధికారుల బృందం ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత పాత్ర, నిందితులతో ఉన్న సంబంధాలు, ఇండోస్పిరిట్స్ కంపెనీలో వాటాలు, 100 కోట్ల ముడుపుల వ్యవహారంపై కవితను ఇడి ప్రశ్నిస్తోంది. ఇప్పటి వరకు ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత పాత్రపై సేకరించిన ఆధారాలు సాక్ష్యాలతో కవితను ప్రశ్నిస్తోంది.

మౌఖికంగా, లిఖితపూర్వకంగా కవిత స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేస్తున్నారు. అరుణ్ పిళ్ళై, బుచ్చిబాబు, అభిషేక్, శరత్ చంద్రారెడ్డి, మాగుంట రాఘవ, సమీర్ మహేంద్రు, అమిత్ అరోరా ఇచ్చిన సమాచారంతో కవితను ఈడీ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

వికలాంగ చిత్రకారిణి షేక్ నఫీస్‌కు అంతర్జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి-కల్చరల్

మస్క్యులర్ డిస్ట్రోఫి (కండర క్షిణిత) వ్యాధితో బాధపడుతూ 30 ఏళ్లుగా చీకటి గదికే పరిమితమైన షేక్ నఫీస్ తన కళతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. హైదరాబాద్ నగరానికి చెందిన షేక్ నఫీస్ వేసిన చిత్రాలను ప్రతిష్టాత్మక వరల్డ్ ఆర్ట్ దుబాయ్‌లో ప్రదర్శించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సారంగి ఫౌండేషన్ ఆధ్వర్యాన దుబాయ్‌లో జరుగుతున్న వరల్డ్ ఆర్ట్ దుబాయ్ ఎగ్జిబిషన్‌లో ఆమె చిత్రాలను ప్రదర్శనకు ఉంచారు. కండరాల క్షణితతో బాధపడుతున్న నఫీస్ 2018 ప్రతిభ వెలుగులోకి వచ్చింది. మొదటిగా రాష్ట్ర స్థాయిలో, ఆ తర్వాత జాతీయ స్థాయిలో పెయింటింగ్ ఎగ్జిబిషన్ నిర్వహించి ప్రతిభను చాటింది. దుబాయ్ ఎగ్జిబిషన్‌కు నఫీస్ పెయింటింగ్స్‌తో వెళ్లిన సామాజికవేత్త ఖాజా ఆఫ్రిది మాట్లాడుతూ.. నాలుగు గోడలకే పరిమితమైన నఫీస్ కళను నలుగురికి చూపించాలనే తన సంకల్పం నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. 2018లో రవీంద్రభారతిలో, 2021లో ఢిల్లీ వేదికగా నఫీస్ చిత్రాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో దుబాయ్ వేదికగా జరిగే వరల్డ్ ఆర్ట్ దుబాయ్ ఎగ్జిబిషన్‌లో నఫీస్ చిత్రాలను ప్రదర్శించే అవకాశం లభించిచడం అదృష్టంగా భావిస్తున్నాని ఖాజా ఆఫ్రిది తెలిపారు. ఈ నెల 9 నుండి 12వ తేదీ వరకు దుబాయ్ వేదిక జరిగే ఈ వేడుకల్లో నఫీస్ చిత్రాలను ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనను షేక్ నఫీస్ వర్చువల్ గా తిలకించి సంబరపడ్డారని తెలిపారు.

ఝాన్సీ లక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి-కల్చరల్

ప్రతి స్త్రీ తనపై జరిగే దాడులు, వివక్షతకు వ్యతిరేకంగా ఝాన్సీ లక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకొని ఎదిరించాలని రంగారెడ్డి జిల్లా న్యాయసేవ సంస్థ కార్యదర్శి శ్రీదేవి కోరారు. భారత్ ఆర్ట్స్ అకాడెమీ, ఎబిసి ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో రవీంద్రభారతి ప్రధాన వేదికపై అంతర్జాతీయ మహిళ దినోత్సవ్ సందర్భంగా సంగీత.నృత్య కార్యక్రమం, ఝాన్సీ లక్ష్మీబాయి పురస్కర ప్రదానోత్సవం జరిగింది. సంగీత గురువులు నవ్య, వర్ష, రజని విష్ణు ప్రియ, నాట్య గురువులు స్నేహశర్మ, జ్యోతి తదితర శిష్య బృందం సంగీత నాట్య ప్రదర్శనలతో ప్రేక్షకుల ప్రశంస పొందారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో భారత్ వరల్డ్ రికార్డ్స్ చైర్మన్ రమణారావు అధ్యక్షత వహించగా శ్రీదేవితోపాటు విఖ్యాత నాట్య గురువు పసుమర్తి రామలింగ శాస్త్రి పాల్గొని మాట్లాడారు. శాస్త్రీయ నృత్యం సంగీతం పరిపుష్టికి భారత్ ఆర్ట్స్ అకాడమీ చేస్తున్న కషి అభినందనీయమని అన్నారు. నటుడు జె.ఎల్.శ్రీనివాస్, నటీమణులు శ్రీదేవి దేశాయి, మేఘన, పద్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రతిభావంతులైన మహిళలకు ఝాన్సీ లక్ష్మీబాయి పురస్కారం, నర్తకులకు మయూరి రత్న, సిద్ధేంద్ర నర్తన, నాట్య చూదామణి, సంగీత కళాకారులకు గాన రసమయి పురస్కరాలు బహూకరించారు. లలితారావు కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారుల

కవితపై అనుచిత వ్యాఖ్యలు తగవు: ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ కవితపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ వ్యాఖ్యలు అనుచితంగా, సంస్కారహీనంగా ఉన్నాయనీ, ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆర్ అరుణజ్యోతి, మల్లులక్ష్మి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాజకీయ విమర్శలు ఇంగిత జ్ఞానంతో చేయాలని హితవుపలికారు. మహిళలంటే ఆ పార్టీకి చులకన భావం ఉన్నదనీ, అందుకే సంజయ్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలనీ, లేదంటే తగిన విధంగా మహిళలు బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

మాణిక్‌రెడ్డికి ఓటేయండి

- ఉపాధ్యాయులకు చుక్కా రామయ్య, నాగేశ్వర్ బహిరంగ లేఖ

ప్రజాశక్తి. -హైదరాబాద్ బ్యూరో

"మచ్చలేని జీవితం.. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడే తత్వం.. గతమంతా ఉద్యమ చరిత్ర.. ఆయనకు ఓటేస్తే మనలను మనం గెలిపించుకున్నట్టే.. అందుకే మేము హామీ ఇస్తున్నాం.. మాణిక్‌రెడ్డికి ఓటేయండి" అంటూ మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన టిఎస్‌యుటిఎఫ్ సీనియర్ నేత మాణిక్‌రెడ్డికి ఓటేయాలంటూ మాజీ ఎమ్మెల్సీలు చుక్కా రామయ్య, ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగేశ్వర్ ఉపాధ్యాయ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో వారికి ఇరువురూ బహిరంగ లేఖ రాశారు. మీడియాకు విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో మాణిక్‌రెడ్డి రాజీపడబోరని ఇరువురూ వ్యాఖ్యానించారు. సిపిఎస్ సమస్య, పిఆర్‌సి, అక్రమ బదిలీల విషయంలో ప్రభుత్వంతో నేరుగా పోట్లాడారని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసే మాణిక్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాణిక్‌రెడ్డికి మరో సంఘం మద్ధతు ప్రకటించింది. ఇప్పటివరకు మొత్తం 12 సంఘాలు సహకారం అందించేందుకు ముందుకొచ్చాయని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. మాణిక్‌రెడ్డికే మా ఓటు: మేవా

ఉపాధ్యాయుల గొంతుక పాపన్నగారి మాణిక్‌రెడ్డికే మా ఓటు అంటూ తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం (మేవా) సంపూర్ణ మద్ధతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ మసూద్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ జుబేర్ అహ్మద్ లేఖ అందజేశారు. గతంలో ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన వారు ఎలా పనిచేశారో, ఎవరికి ఊడిగం చేశారో మనందరికి తెరిచిన పుస్తకమని గుర్తు చేశారు. ప్రలోభాలు, తాయిలాలకు ఉపాధ్యాయ సమాజం లొంగదని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాణిక్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తరాలు మారినా పేదల బతుకులు మారలేవని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి అన్నారు. 50 ఏండ్లుగా పేదలు కిరాయి ఇండ్లల్లోనే నివసిస్తున్నారని, పాలకులు వారికి కనీసం 120 గజాల ఇంటి స్థలం కేటాయించకపోవడం దారుణమని అన్నారు. నెహ్రూనగర్‌లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం నెహ్రూనగర్‌లో చేపట్టిన భూపోరాట కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. గుడిసెలు వేసుకున్న పేదలతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు నిలువ నీడ కల్పించకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి పేదలు సుమారు 50 ఏండ్ల నుంచి అద్దె ఇండ్లల్లో ఉండి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరిగా పనుల్లేక ఇంటి కిరాయి చెల్లించలేక పిల్లలను సైతం సరిగ్గా చదివించలేకపోయారని చెప్పారు. పెట్రో, వంట గ్యాస్ ధరల పెరుగుదలతో నిత్యావసర ధరలు అమాంతంగా పెరిగాయని, దీంతో బతకడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల మీద ధరలు పెంచుతూ మరింత భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం గ్యాస్ బండ ధర రూ.410 నుంచి 1220 రూపాయల వరకు పెంచడంతోపాటు డీజిల్, పెట్రోల్, కూరగాయలు, పప్పులు ఉప్పులు నూనె కారం ధరలు పెంచుతూ పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దలకు రాయితీలు కల్పిస్తూ పేదలపై భారాలు మోపుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ గుడిసెవాసులకు అండగా ఉంటామని చెప్పారని, గుడిసెలు తొలగించొద్దని తహసీల్దార్‌ను ఫోన్‌లో ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. దీంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఐద్వా జిల్లా కార్యదర్శి సబ్బని లత, సిపిఎం డివిజన్ కార్యదర్శి ఏశాల గంగాధర్, ఫారూఖ్ మన్సూర్, గంగామణి, జరీనా యాస్మిన్ రాజు ఉన్నారు.

ఐడిఎఫ్‌సి ఎంఎఫ్ ఇక బంధన్ మ్యూచువల్ ఫండ్

ముంబయి : ఐడిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ కొత్తగా బంధన్ మ్యూచువల్ ఫండ్‌గా పేరు మార్చుకుంది. మార్చి 13 నుంచి కొత్త పేరుతో కనిపించనుంది. తదనుగుణంగా ఈ ఫండ్ హౌస్ ప్రతి పథకానికి ఐడిఎఫ్‌సి పదానికి బదులుగా బంధన్ పదం కనిపించనుందని ఆ సంస్థ వెల్లడించింది. పెట్టుబడుల వ్యూహాలు, ప్రక్రియలు, బందం మాత్రం అదే కొనసాగుతుందని పేర్కొంది. మదుపరులు, అదే తరహా అత్యున్నత నాణ్యత కలిగి పెట్టుబడుల విధానంతో ప్రయోజనం పొందగలరని ఎఎంసి సిఇఒ విశాల్ కపూర్ పేర్కొన్నారు. రీ బ్రాండింగ్ పేరు, లోగో మారనుందన్నారు. బంధన్ మ్యూచువల్ ఫండ్ ఈ ఫండ్ హౌస్ ప్రయాణంలో నూతన అధ్యాయానికి ప్రతీకగా నిలువడంతో పాటుగా తమ వ్యాపారాలకు నూతన శక్తిని తీసుకురానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బిఆర్ఎస్ కోసమే మహిళా కమిషన్

- టిటిడిపి నేత జ్యోత్స్న

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వంపై టిటిడిపి నేత జ్యోత్స్న విమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ కోసమే తెలంగాణ రాష్ట్రంలో మహిళా కమిషన్ పనిచేస్తోందని టిటిడిపి నేత జ్యోత్స్న ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర గవర్నర్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ, శాసన మండలి విప్ కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు మహిళ కమిషన్ ఎందుకు స్పందించలేదని ఆమె ప్రశ్నించారు. మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే కెసిఆర్ సర్కార్ కళ్లు మూసుకుందని మండిపడ్డారు. కవిత మాత్రమే తెలంగాణ మహిళనా? అని మండిపడ్డారు.

బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసన

- నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- బంజారాహిల్స్ పిఎస్‌లో కేసు నమోదు
- రాజ్‌భవన్ ముందు మేయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో 'కవితను ఇడి అరెస్ట్ చేస్తుందా' అని ఓ విలేకరి ప్రశ్నించగా 'కవితను అరెస్ట్ చేయకుంటే.. ముద్దుపెట్టుకుంటారా...' అంటూ బండి సంజయ్ స్పందించారు. బండి సంజయ్ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగాయి. బండి సంజయ్‌పై హైదరాబాద్ నగరంలోని పలు పోలీసు స్టేషన్లలో బిఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయం ముందు ఎమ్మెల్యే దానం నాగేందర్, తలసాని సాయికిరణ్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. బండి సంజయ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు ఫిర్యాదు చేసేందుకు హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు రాజ్‌భవన్‌కు వచ్చారు. అయితే సాయంత్రం వరకు వారికి గవర్నర్ అపాయింట్‌మెంట్ రాకపోవడంతో అక్కడే వారు ఆందోళనకు దిగారు. బండి సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ నుంచి నేరుగా ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ కవితకు మద్దతుగా ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. విపక్షాలను లొంగదీసుకునేందుకు బిజెపి కుట్ర పూరిత దాడులు చేస్తుందని, కవిత ఎపిసోడ్ కూడా అదే కోవకు చెందినదని సండ్ర తెలిపారు. బిజెపి, ఇడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మైక్రోసాఫ్ట్‌లో ఆగని ఉద్వాసనలు

- మెటాలోనూ కోతలు

శాన్‌ఫ్రాన్సిస్కో : ఆర్థిక సంక్షోభం భయాల్లో టెక్ కంపెనీలు వరుస పెట్టి ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వరుసగా మూడో విడత తమ ఉద్యోగులకు ఉద్వాసనలు పలికుతుందని సమాచారం. ఈ సారి సప్లయ్ చెయిన్, క్లౌడ్, కృత్రిమ మేధ (ఎఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ వంటి విభాగాల్లోని వారిని తొలగించినట్లు శనివారం రిపోర్టులు వచ్చాయి. 2023 జనవరిలోనే 10 వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటన చేసింది. ఇందులో భాగంగానే తాజా ఉద్వాసనలు చోటు చేసుకున్నాయని తెలుస్తోంది. అయితే ఎంత మందిని తొలగించేది వెల్లడించలేదు. ఇటీవలే వాషింగ్టన్‌లో 689 మంది ఉద్యోగులకు పింక్ స్లిప్‌లు ఇచ్చింది. గత నెలలో వాషింగ్టన్‌లో 617 మందిని ఇంటికి సాగనంపింది. జనవరిలో ఉద్వాసన పలికి 878 మందితో మొత్తం వాషింగ్టన్ రాష్ట్రంలోనే 2184 మందిని తొలగించింది. కత్రిమ మేధ (ఎఐ) చేపట్టిన ప్రాజెక్ట్ బొన్సాయ్‌ని సంస్థ మూసివేస్తున్నట్లు ఓ ఉద్యోగి వెల్లడించారు. మరోవైపు 18 ఏళ్ల పైగా పని చేస్తున్న ఓ ప్రిన్సిపల్ ప్రొడక్ట్ మేనేజర్ సహా తనతో పని చేసే మొత్తం గ్రూపు సభ్యులకు ఉద్వాసన పలికింది. ఆర్థిక సంక్షభం భయాలతో టెక్ కంపెనీల వరుస పెట్టి ఉద్యోగులను పీకేస్తుండటంతో వారి కుటుంబాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా వచ్చే వారంలో ఉద్యోగులకు కోత విధించనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే మెటా నాలుగు నెలల క్రితం 11వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఇది మొత్తం ఉద్యోగుల్లో 13 శాతానికి సమానం. దీంతో రెండో రౌండ్‌లోనూ ఉద్యోగులను తొలగించ నున్నట్లయ్యింది.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 17% వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 10 నాటికి ప్రత్యక్ష పన్ను వసూళ్ల 17 శాతం పెరిగి రూ.13.73 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి కేంద్రం పెట్టుకున్న సవరించిన లక్ష్యంలో ఇది 83 శాతానికి సమానం. బడ్జెట్‌లో పెట్టుకున్న అంచనాతో పోల్చితే 96.67 శాతానికి సమానం కావడం విశేషం. వ్యక్తిగత పన్ను, కార్పొరేట్ పన్నులను ప్రత్యక్ష పన్నులుగా భావిస్తారు.

ఇన్ఫీ ప్రెసిడెంట్ మోహిత్ జోషి రాజీనామా

బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ ప్రెసిడెంట్ మోహిత్ జోషి తన పదవికి రాజీనామా చేశారు. దాదాపు రెండు దశాబ్దాల నుంచి ఆయన ఇన్ఫీలో వివిధ హోదాల్లో పని చేశారు. త్వరలో ఆయన టెక్ మహీంద్రాలో ఎండి, సిఇఒగా చేరనున్నారు. ప్రస్తుతం టెక్ మహీంద్రా ఎండిగా ఉన్న సిపి గుర్నానీ 2023 డిసెంబర్ 19న పదవీ విరమణ పొందనున్నారు. మోహిత్ జోషి మార్చి 11 నుంచి సెలవులో ఉండగా.. ఈ ఏడాది జూన్ 9 వరకు కంపెనీలో కొనసాగనున్నారు. మోహిత్ ఇన్ఫోసిస్‌లో ఇప్పటి వరకు ఆయన యూరప్ కంపెనీకి సంబంధించి ఫైనాన్షియల్ సర్వీసెస్ బిజినెస్‌ను చూసుకున్నారు. 2000 సంవత్సరంలో ఇన్ఫోసిస్‌లో చేరారు.

ఏప్రిల్ 5న ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ

- కార్మికులు, రైతులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలి
- సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీలో ఏప్రిల్ ఐదో తేదీన జరిగే మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్ పిలుపునిచ్చారు. ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లోని రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కార్మికులను, రైతులను దోపిడీ చేస్తూ అదానీ, అంబానీ వంటి కుబేరులకు 'అమృతకాల్' భరోసా కల్పించేందుకు మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. రోజురోజుకీ నిత్యావసరాల ధరలు పెరిగిపోతుండడంతో సామాన్యులు అల్లాడిపోతున్నారని తెలిపారు. దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరిందని పేర్కొన్నారు. చారిత్రాత్మక రైతుల పోరాటం సందర్భంగా రైతు సంఘాలకు మోడీ సర్కారు రాతపూర్వకంగా ఇచ్చిన గిట్టుబాటు ధర ఏమైందని ప్రశ్నించారు. ఆరోగ్యం, వైద్య సౌకర్యాలు పేదలకు దక్కకుండాపోతున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పని పద్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, పాల్గొన్నారు.

మహిళలను అవమానించాలని ఏ మతం చెప్పింది?

- కూనంనేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అవమానపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళల వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని, బహిరంగంగా మాట్లాడలేని పదాలతో మాట్లాడిన బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉన్నాయని తెలిపారు. కవితపై విచారణ జరుగుతున్న క్రమంలోనే అరెస్టులపై ద్వంద అర్థాలు వచ్చే విధంగా సంజయ్ చేసిన వ్యాఖ్యలు ముందస్తు ప్రణాళికలో భాగమేనని పేర్కొన్నారు. కవితను అరెస్టు చేస్తారనే నిర్ణయానికి బిజెపి నాయకులు ముందే వచ్చారని తెలిపారు. ప్రతిపక్షాల నోర్లు నొక్కడానికి ముందస్తు ప్రణాళికతోనే అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. మహిళలను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేయమని హిందూ సంస్కృతి, సంప్రదాయం నేర్పిందా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలకు బండి సంజయ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.